క్లుప్తంగా

'ఉపాధి' పనుల పరిశీలన


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని కొఠారి, రింఘన్‌ఘాట్ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఎంపీడీవో క్రిష్టా రావు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం నర్సరీ పనులను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతీరోజు నీళ్లు పట్టాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టీఏలు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కెరమెరి: మండలంలోని పెద్దసాకడ గ్రామంలో శనివారం రూ.2 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీరోడ్డు పనులను ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్గుతబాయి ప్రారంభించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, రోడ్డు వేసిన తర్వాత సుమారు నెల రోజులు నీరు పోయాలన్నారు. పీఆర్ఏఈ స్టీవెన్, గ్రామ పెద్దలు సోంజీ, శంకర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్నల్ మార్కుల తనిఖీ


మార్కులు పరిశీలిస్తున్న విజయరాణి

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను తనిఖీ అధికారి, రెబ్బెన జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయరాణి తనిఖీ చేశారు. పాఠశాల సిబ్బంది విద్యార్థులకు నమోదు చేసిన మార్కులను తనిఖీ చేశారు. విద్యార్థుల రికార్డులు పరిశీలించారు.

'కానిస్టేబుల్ మరణం బాధాకరం'

నార్నూర్: మండలంలోని రాజులగూడ గ్రామానికి చెందిన ఆడే ప్రవీణ్ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఇటీవల కాటారం మండలంలోని నస్తుడిపల్లి అటవీ ప్రాంతంలో జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ జనరల్ మేనేజర్ పరిశ్రమల శాఖ జాదవ్ రాంకిషన్ నాయక్ అన్నారు. శనివారం కానిస్టేబుల్ తల్లి ఆడే నిర్మలబాయి, భార్య లలిత బాయిలను పరామర్శించారు. ఆడే ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అయన వెంట కాంగ్రెస్ నాయకులు కౌసర్, దామెర కనకారావు, జాదవ్ కైలాస్, ప్రేమ్‌సింగ్, బానోత్ రామారావు, తదితరులు ఉన్నారు.

'డీసీసీ పదవి ఎస్సీలకు ఇవ్వాలి'

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ డీసీసీ జిల్లా అధ్యక్ష పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి ఇవ్వాలని పార్టీ జిల్లా నాయకులు సోన్‌కాంబ్లే జితేందర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న ఎస్సీ సామాజికవర్గానికి ఇస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్, డొవలే ప్రశాంత్, ప్రకాష్, దయానంద్, సుదోధన్, నవీన్, ఉమేష్ పాల్గొన్నారు.

పుస్తకాల విరాళం

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి పాఠశాల పూర్వ విద్యార్థి రూ.4వేల విలువ గల పుస్తకాలు అందజేశారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి పాటిల్ నాగోరావు ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా గ్రంథాలయం కోసం తనవంతుగా పుస్తకాలను విద్యార్థుల కోసం హెచ్ఎం శ్రీకాంత్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు పవన్, శ్రీనివాస్, సంతోష్, ఉమా మహేశ్వర్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలి

బోథ్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని శ్రీ సంత్ సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. శనివారం ఉత్సవాలకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు చవాన్ వినాయక్ రావ్, ఉపాధ్యక్షుడు రాథోడ్ బాబూలాల్, బంజారా సంఘం అధ్యక్షుడు జాదవ్ సకారం, చవాన్ ఉత్తంసింగ్, ప్రకాష్, పరశురాం పాల్గొన్నారు.

రోడ్డు తవ్వారు.. వదిలేశారు

- నెలలు గడుస్తున్నా మరమ్మతులు లేవు
- పట్టించుకోని అధికారులు


సిర్పూర్ (టి)- మాకిడి మార్గంలో తవ్విన రోడ్డు

సిర్పూర్(టి): మరమ్మతుల కోసం ఉన్న రోడ్డును తవ్వి అలాగే వదిలేయడంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి మహారాష్ట్రకు వెళ్లే సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపం నుంచి మాకిడి చౌరస్తా వరకు మరమ్మతుల కోసం రోడ్డును పూర్తిగా తవ్వి వదిలేశారు. రోడ్డును తవ్వి మూడు నెలలు గడుస్తున్నా మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి కావడంతో పాటు అంతర్రాష్ట్ర రహదారి కావడంతో ప్రతినిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. ప్రతీరోజు మండల కేంద్రంలోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు మండల వాసులు, సమీపంలోని మహారాష్ట్ర గ్రామాలకు, పట్టణాలకు ప్రయాణాలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లులు రావడంలేదని..

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు కాగా సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డు నిర్మాణ పనులు అక్కడక్కడ నిలిపివేశారు. నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులు సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో కాంట్రాక్టరు మిగిలిన రోడ్డు మరమ్మతులకు ఉన్న రోడ్డును తవ్వారు. అయితే రోడ్డుకు సంబంధించిన బిల్లులు రావడంలేదని తవ్విన రోడ్డును మధ్యలోనే నిలిపివేసి మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు నెలల తరబడి అవస్థలు పడుతున్నారు.

అధికారులు స్పందించాలి



బస్టాండ్ ప్రాంతం నుంచి మాకిడి చౌరస్తా వరకు ఉన్న రోడ్డు మధ్యలో తవ్వి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలి.

- బామినే పోశం, సిర్పూర్(టి)

కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలి



బస్టాండ్ ప్రాంతం నుంచి మాకిడి చౌరస్తా వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలి. రోడ్డు మరమ్మతుల కోసం ఉన్న రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రతీరోజు ప్రయాణాలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- లక్ష్మణ్, సిర్పూర్(టి)

అటు భగభగ.. ఇటు గజగజ!

- పగలు ఎండ.. రాత్రి చలి
- జిల్లాలో తగ్గని చలి తీవ్రత
- పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన



జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో)..

తేదీ	కనిష్టం	గరిష్టం
14	17.2	34
15	16.4	35
16	13.5	35
17	12.7	37

కౌటాల: ఒకవైపు తగ్గని చలి తీవ్రత.. మరోవైపు పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు.. వెరసి అసాధారణ వాతావరణం జిల్లా వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పగలు సాధారణం కన్నా ఎక్కువ ఉంటున్న ఎండలు రాత్రి కాగానే ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మార్చి నుంచి ఎండల తీవ్రత పెరగడం సాధారణం కానీ ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉదయం 9 గంటలు దాటిందంటే ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుంది. పగటి పూట ఎండ పెరగడంతో చాలా మంది బయటకు రావడం లేదు. దీంతో రోడ్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. అలాగే బయటకు వచ్చిన వారు వేడి నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అప్పుడే ఎండ..

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం చలి, మంచు ప్రభావం ఉంటున్నా వారం రోజులుగా మధ్యాహ్నం అయ్యేసరికి 34 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతుంది. జిల్లాలో అసాధారణ వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలు, రాత్రి వేళ ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది. వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజలు పలు రోగాల బారిన పడే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వ్యాధులు సోకే ప్రమాదం..

వేసవికి ముందే మధ్యాహ్నం వేళ సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. వాతావరణ మార్పులతో వైరల్ ఇన్‌ఫెక్షన్స్ విజృంభిస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వైరల్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రధానంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి, తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. ఆయా అనారోగ్య లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణ మార్పులతో వైరల్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా వస్తుంటాయి. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా వాటి బారిన పడకుండా ఉండొచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి..

- మంచులో ఎక్కువగా తిరగకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో తిరగాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి.
- అతి శీతల నీరు తాగకూడదు. బాగా కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి.
- గొంతునొప్పి, జ్వరం, ఒంటి నొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తే వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా గుర్తించి వైద్యం చేయించుకోవాలి.
- డ్రెయినేజీల సమీపంలో నివసించే వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల బెడద లేకుండా జాగ్రత్త పడాలి.
- ఇప్పటి నుంచి ఎండలు మండుతున్నాయి. రోడ్డు వెంట విక్రయించే చల్లని రంగు పానీయాలు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలి. మద్యం, మాంసం తగ్గించాలి.
- నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు వాడడం.. టోపీ ధరించడం మంచిది.

పాఠశాల స్థలం కబ్జా కాకుండా చూడాలి

వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, సదరు స్థలం కబ్జాకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని శనివారం గ్రామస్తులు, నాయకులు వాంకిడి పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా మురికి నీరు పాఠశాల ఆవరణలోకి రాకుండా కాలువ నిర్మించేందుకు ఉత్తరం దిక్కు 6 ఫీట్ల స్థలాన్ని వదిలేయగా ఆ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలకు ఉత్తరం వైపు ఉన్న ఇంటి నుంచి వచ్చే మురుగు నీరు పాఠశాల ప్రహరీలోనికి రాకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్, ఆరె సంఘం నాయకులు బొట్టుపల్లి జైరాం, మాజీ ఉప సర్పంచ్ పవన్ సాయి, సదాశివ్, వినోద్ పాల్గొన్నారు.

బాబా ధ్యానకేంద్రం వార్షికోత్సవం


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న భక్తులు

జైనూర్: మండలంలోని భూసిమెట్ట క్యాంపులో బాబా ధ్యానకేంద్రం 17వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబా ధ్యానధారణ చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బందుకే భగవాన్‌శ్యాంరావు, బాల్‌రాజ్, ఉత్తమ్, మారుతి, భగవాన్, నారాయణ్, రాజారాం తదితరులున్నారు.

8న తాటిపల్లి మహా జాతర


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి వార్ధా నది ఒడ్డున గల శ్రీ శివ సిద్ధి హనుమాన్ ఆలయంలో మార్చి 8న మహాశివరాత్రి మహా జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో శనివారం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహాజాతరకు వచ్చే భక్తుల కోసం పూర్తి ఏర్పాట్లు చేస్తామన్నారు. భారీ వరదల కారణంగా రోడ్లు కొట్టుకుపోవడంతో పాటు విద్యుత్ తీగలు తెగిపోయినట్లు తెలిపారు. అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగం పొందిన యువతకు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: యువత లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో కుమురం భీం స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగం పొందిన యువతను అభినందించి శాలువాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన యువత కోసం ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్‌ను వినియోగించుకొని ముందుకు వెళ్లాలన్నారు. స్టడీ సర్కిల్‌లో ఇప్పటి వరకు 15 మంది ఉద్యోగం సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఊశన్న, రాజశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

బోరు వేయించిన ఎమ్మెల్యే


బోరు వేయిస్తున్న బీజేపీ నాయకులు

కౌటాల: మండలంలోని శీర్షా గ్రామంలో గల బీరప్ప ఆలయం వద్ద భక్తులకు తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని స్థానికులు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే స్పందించారు. ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో గుడి వద్ద శనివారం బోర్ వేయించారు. గ్రామంలో బీరప్ప పండుగ పురస్కరించుకొని ఆలయంలో వారం రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు తాగు నీటికి ఇబ్బందులు కలగవద్దని ఎమ్మెల్యే చేతి పంపు వేయించడంతో భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు తిరుపతి, చందు, శంకర్, కమిటీ సభ్యులు పోశమల్లు, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


లింగాపూర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు


వాంకిడి: కేక్ కట్ చేస్తున్న అజయ్‌కుమార్

లింగాపూర్: మండల కేంద్రంలోని గాంధీచౌక్ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్ కుమార్, ఎంపీపీ ఆడె సవితాప్రేమ్, వైస్ ఎంపీపీ ఆత్మారాం తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. మాజీ సర్పంచ్ తుకారాం, ఖమాన ఎంపీటీసీ ప్రవీణ్, మండల యూత్ అధ్యక్షుడు రాకేశ్ నాయకులు ఉన్నారు.

జైనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, అంబాజీ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: మాజీ సీఎం, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో, గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించారు. జెడ్పీటీసీ సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలకు స్థలమేది..?


పత్తి కట్టెలు తొలగించి ఏర్పాటు చేసుకున్న వాలీబాల్ మైదానం

- క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో అధికారులు విఫలం
- పత్తి చేలను మైదానాలుగా మార్చుకుంటున్న యువకులు

వాంకిడి: యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు, వారిని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ప్రాంగణాల్లో యువతకు అన్ని సౌకర్యాలతో పాటు క్రీడా సామగ్రి సైతం అందించారు. కానీ క్షేత్రస్థాయిలో ఏ ఒక్క గ్రామానికి సరైన మైదానం ఏర్పాటు చేయలేదు. కొన్ని చోట్ల గ్రామ సమీపాల్లో ప్రభుత్వ భూములు లేని కారణాలను చూపుతూ అధికారులు క్రీడా ప్రాంగణాలకు గ్రామాలకు కొన్ని కిలో మీటర్ల దూరంలో ఉండే స్థలాలను కేటాయించారు. అందులో కొన్ని స్థలాలు వివాదాలకు దారి తీయగా ఇప్పటికీ సదరు స్థలాల్లో కనీసం బోర్డులు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంది. మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని సౌకర్యాలతో కూడుకున్న ఏ ఒక్క మైదానం పల్లె యువతకు అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వం నుంచి అందిన క్రీడా సామగ్రిని యువకులకు పంపిణీ చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులు దులుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో యువత ముందుకొచ్చి గ్రామ సమీపాల్లోని పత్తి చేలను క్రీడా మైదానాలుగా ఏర్పాటు చేసుకున్నారు.

పంట పొలాలే దిక్కు..

గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. కానీ అధికారులు స్థలాలను గుర్తించడంలో ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో మైదానాలు కలగానే మిగిలిపోయాయి. మండల కేంద్రంతో పాటు ఏ గ్రామ పంచాయతీలోనూ యువకులకు ఆటలు ఆడుకునేందుకు వీలున్న క్రీడా మైదానాలు లేవు. గ్రామాల్లోని యువకులు, క్రీడలపై ఆసక్తి గల వారు గ్రామ సమీపాల్లోని పంట పొలాల్లో గ్రౌండ్‌లను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. మండలంలో అధికంగా పత్తి సాగు ఉన్నందున ఫిబ్రవరిలో పొలం పనులు పూర్తవుతాయి. దీంతో ఫిబ్రవరి నుంచి మే వరకు నాలుగు నెలలు ఆటలు ఆడుకునేందుకు పత్తి కట్టెలు తొలగించి మైదానాలు ఏర్పాటు చేస్తున్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ మైదానాలు ఏర్పాటు చేసుకొని నాలుగు నెలల పాటు ఆటలు ఆడుకోవడం, పోటీలు నిర్వహించడం చేస్తుంటారు. మే, జూన్‌లల్లో చేలల్లో దుక్కులు ప్రారంభమవుతుండగా, యువత క్రీడలకు దూరంగా ఉంటున్నారు. అధికారులు ఇప్పటికైనా క్రీడాకారులను ప్రోత్సహించేలా మైదానాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నాలుగు నెలలు ఆడుకుంటాం



గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో ఎలాంటి సౌకర్యాలు కల్పించ లేదు. ఏటా గ్రామంలో పత్తి పంట సీజన్ అయిపోయాకే ఆటలు ఆడేందుకు చోటు దొరుకుతుంది. చేలల్లోనే మైదానాలు ఏర్పాటు చేసుకొని నాలుగు నెలల పాటు ఆడుకుంటాం.

- సొనుర్లే నానాజీ, కోమటిగూడ

క్రీడలకు స్థలం లేదు..



గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలం గ్రామానికి ఆరు కి.మీల దూరంలో ఉంది. ఎలాంటి సౌకర్యాలు కూడా లేవు. దీంతో చేలల్లో పత్తి కట్టెలు తొలగించి మైదానం ఏర్పాటు చేసుకుంటాం. పొలం పనులు ప్రారంభమయ్యాక క్రీడలకు స్థలం ఉండడం లేదు.

- అముల్, ఖమాన

ఘనంగా సాల్వే జయంతి


సాల్వే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దళిత సంఘాల నాయకులు

జైనూర్: క్రాంతివీర్ లహూజీ సాల్వే సమాజానికి అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మోహళే దత్తా అన్నారు. శనివారం మండల కేంద్రంలో క్రాంతివీర్ లహూజీ సాల్వే 143వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సాల్వే అడుగు జాడల్లో నడవాలన్నారు. దళిత సంఘాల నాయకులు పులారే విజయ్, దత్తారాజ్, సుద్దాల శ్రీనివాస్, కేశవ్, పులారే సోపాన్‌రావు తదితరులు ఉన్నారు.

ధృవ ఫౌండేషన్ చేయూత

లింగాపూర్: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబం ఆడె పంచపుల్లా సీతారాం దంపతులు కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఇంటిలో నివసిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో పాటు మరి కొద్దిరోజుల్లో వారి కుమార్తె పెళ్లి ఉండడంతో ఇంటి మరమ్మతుల కోసం ధృవ ఫౌండేషన్ చైర్మన్ జాటోత్ రాహుల్ 5 ట్రాక్టర్ల మొరం పోయించడంతో పాటు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు రాహుల్‌ను అభినందించారు.

22న తుది గడువు

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశం కోసం దరఖాస్తుల గడువు 22న ముగుస్తుందని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.